# అరటి పువ్వును తినడం వల్ల ఇన్ని లాభాలు ఉన్నాయా..?

## తెలిస్తే వెంటనే తినడం ప్రారంభిస్తారు..!



అరటి పండ్లను తినడం వల్ల ఎన్ని ఆరోగ్యకరమైన ప్రయోజనాలు కలుగుతాయో అందరికీ తెలిసిందే. అరటి పండ్లు మనకు ఏడాది పొడవునా అందుబాటులో ఉంటాయి. అన్ని సీజన్లలోనూ లభిస్తాయి. చాలా తక్కువ ధరకే కొనుగోలు చేయవచ్చు. కనుక అరటి పండ్లను చాలా మంది తింటుంటారు. అయితే కేవలం అరటి పండ్లే కాదు, అరటి పువ్వులు కూడా మనకు మేలు చేస్తాయి. అరటి పువ్వులను కూరగా చేసుకుని తినవచ్చు. ఇది ఎంతో రుచిగా ఉంటుంది. మన దేశంతోపాటు పలు ఆసియా దేశాలకు చెందిన వారు అరటి పువ్వును కూడా వంటల్లో ఉపయోగిస్తుంటారు. దీని వల్ల అనేక పోషకాలు లభిస్తాయి. అలాగే అనేక ఆరోగ్య ప్రయోజనాలను పొందవచ్చు. అరటి పువ్వులో అనేక విటమిన్లు, మినరల్స్, యాంటీ ఆక్సిడెంట్లు ఉంటాయి. ఇవి మనల్ని రోగాల నుంచి రక్షిస్తాయి. శరీరం ఆరోగ్యంగా ఉండేలా చేస్తాయి.

**బరువు తగ్గేందుకు..**

అరటి పువ్వులో ఫైబర్ అధికంగా ఉంటుంది. ఇది మలబద్దకం తగ్గేలా చేస్తుంది. జీర్ణ వ్యవస్థలో మంచి బ్యాక్టీరియాను వృద్ధి చేస్తుంది. ఇది జీర్ణ సమస్యలు రాకుండా చూస్తుంది. జీర్ణ వ్యవస్థను ఆరోగ్యంగా ఉంచుతుంది. ఫైబర్ వల్ల కడుపు నిండిన భావన కలుగుతుంది. ఆహారం తక్కువగా తింటారు. దీని వల్ల బరువు తగ్గడం తేలికవుతుంది. అరటి పువ్వులో ఫ్లేవనాయిడ్స్, ఫినోలిక్ సమ్మేళనాలు, టానిన్స్ అధికంగా ఉంటాయి. ఇవన్నీ శక్తివంతమైన యాంటీ ఆక్సిడెంట్ల జాబితాకు చెందుతాయి. ఇవి ఫ్రీ ర్యాడికల్స్ ను తొలగిస్తాయి. దీని వల్ల ఆక్సీకరణ ఒత్తిడి తగ్గుతుంది. శరీరంలో అంతర్గతంగా ఉండే వాపులు తగ్గిపోతాయి. దీంతో గుండె జబ్బులు, క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధులు రాకుండా సురక్షితంగా ఉండవచ్చు. అరటి పువ్వులో పొటాషియం, మెగ్నిషియం అధికంగా ఉంటాయి. ఇవి గుండెను ఆరోగ్యంగా ఉంచుతాయి. బీపీని నియంత్రిస్తాయి. దీని వల్ల రక్త సరఫరా మెరుగు పడుతుంది.

**షుగర్ లెవల్స్‌కు..**

అరటి పువ్వు గ్లైసీమిక్ ఇండెక్స్ చాలా తక్కువగా ఉంటుంది. కనుక దీన్ని తింటే షుగర్ లెవల్స్ అమాంతం పెరగవు. దీని వల్ల డయాబెటిస్ అదుపులో ఉంటుంది. పైగా ఈ పువ్వులో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు, ఫైబర్ వల్ల ఇన్సులిన్‌ను శరీరం మెరుగ్గా ఉపయోగించుకుంటుంది. దీని వల్ల షుగర్ లెవల్స్ తగ్గి డయాబెటిస్ నియంత్రణలో ఉంటుంది. అరటి పువ్వులో విటమిన్ సి అధికంగా ఉంటుంది. ఇది శక్తివంతమైన యాంటీ ఆక్సిడెంట్‌గా పనిచేస్తుంది. దీని వల్ల రోగ నిరోధక వ్యవస్థ పటిష్టంగా మారుతుంది. శరీరం ఇన్‌ఫెక్షన్లకు వ్యతిరేకంగా పోరాటం చేస్తుంది. శరీరంలోని వాపులు తగ్గిపోతాయి. మహిళలు రుతు సమయంలో ఈ పువ్వులను తింటుంటే ఎంతగానో ప్రయోజనం ఉంటుంది. ఈ పువ్వులను తినడం వల్ల అతిగా రక్తస్రావం జరగకుండా అడ్డుకోవచ్చు. కడుపు నొప్పి నుంచి ఉపశమనం లభిస్తుంది. నెలసరి సక్రమంగా వస్తుంది. రుతు సమస్యలు తొలగిపోతాయి.

**రక్తహీనత తగ్గేందుకు..**

అరటి పువ్వును తింటే బాలింతల్లో పాలు బాగా పడతాయి. ఈ పువ్వుల్లో ఐరన్ అధికంగా ఉంటుంది. కనుక ఈ పువ్వులను తింటే హిమోగ్లోబిన్ ఉత్పత్తి అవుతుంది. ఎర్ర రక్త కణాలు వృద్ధి చెందుతాయి. దీంతో రక్తహీనత తగ్గుతుంది. నీరసం, అలసట నుంచి బయట పడవచ్చు. అరటి పువ్వును కూరగా లేదా పచ్చడి రూపంలో తయారు చేసి తినవచ్చు. దీన్ని సలాడ్స్‌లోనూ వేసుకోవచ్చు. దీంతో సూప్‌లను కూడా తయారు చేసి తింటారు. ఇలా అరటి పువ్వును తినడం వల్ల అనేక లాభాలను పొందవచ్చు.

# ఈ డ్రింక్ మితిమీరిన కోపాన్ని కంట్రోల్ చేస్తుందా?



తులసి మొక్క లేని ఇంటిని చూడటం చాలా అరుదు. మతపరమైన కారణాల వల్లనే కాదు, దాని ఔషధ గుణాల కారణంగా కూడా, తులసి మొక్కలను అందరి ఇళ్లలో పెంచుతారు. తులసి ఆకులు జలుబు, దగ్గుకు మాత్రమే కాకుండా అనేక తీవ్రమైన వ్యాధులకు కూడా దివ్యౌషధం. ఇది అందరికీ తెలిసిన విషయమే... కానీ, ఇంకా ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే తులసి ఆకులు, గింజలు మాత్రమే కాకుండా, తులసి కాండం కూడా అనేక ఔషధ గుణాలను కలిగి ఉంది. తులసి కాండంను నీటిలో మరిగించి, కషాయం తయారు చేసి తినడం ద్వారా లెక్కలేనన్ని ప్రయోజనాలను పొందవచ్చని ఆయుర్వేద నిపుణులు చెబుతున్నారు. కాబట్టి, తులసి కాండం వల్ల ఆరోగ్యానికి కలిగే ప్రయోజనాలు ఏంటో ఇప్పుడు తెలుసుకుందాం..

తులసి ఆకుల రసం రోజూ తీసుకోవడం వల్ల అనేక తీవ్రమైన వ్యాధులను నివారించవచ్చని ఆయుర్వేద నిపుణులు చెబుతున్నారు. ఇది ఒత్తిడి, నిరాశ వంటి సమస్యల నుండి శరీరాన్ని రక్షించడంలో సహాయపడుతుంది. తులసి ఆకులను రోజూ నమలడం వల్ల కార్టిసాల్ హార్మోన్ల స్రావం తగ్గుతుంది, ఇది ఒత్తిడి, అధిక కోపాన్ని తగ్గిస్తుంది. తులసి టీ లేదా కషాయాలను తాగడం వల్ల మానసిక స్థితి మెరుగుపడుతుంది. ఇది తులసి ప్రయోజనాల్లో ఒకటి. దాని కాండంలో మరిన్ని ప్రయోజనాలు ఉన్నాయి.

తులసి కాండం ప్రయోజనాలు

ఔషధ గుణాలు కలిగిన తులసి కాండాల కషాయం శరీర రోగనిరోధక శక్తిని పెంచడానికి సహాయపడుతుంది. జలుబు, దగ్గు, జ్వరం, సైనస్ సమస్యల వంటి శ్వాసకోశ వ్యాధులకు ఇది మంచి ఔషధంగా పనిచేస్తుంది. తులసి కాండం కషాయం జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది, ఆకలిని పెంచుతుంది, జీవక్రియను పెంచుతుంది, మానసిక ఒత్తిడిని తగ్గిస్తుంది. ప్రతికూల శక్తుల నుండి రక్షించడంలో కూడా సహాయపడుతుంది. తులసి ఆకుల కషాయం శరీరాన్ని బ్యాక్టీరియా, వైరస్‌ల వంటి ఇన్ఫెక్షన్‌ల నుండి రక్షించే గుణాన్ని కూడా కలిగి ఉంటుంది.



# నవరాత్రి ఉపవాసంలో ఎక్కువసేపు నీళ్లు తాగకపోతే ఏమవుతుంది?

నవరాత్రి పండుగ సమయంలో, భక్తులు దుర్గాదేవి పట్ల భక్తిలో మునిగిపోతారు. ఈ తొమ్మిది రోజుల పండుగ ఆధ్యాత్మిక, మతపరమైన ప్రాముఖ్యతను కలిగి ఉండటమే కాకుండా, శరీరం, మనస్సును ఉత్తేజపరిచే అవకాశాన్ని కూడా అందిస్తుంది. అయితే, ఉపవాసం సమయంలో చాలా మంది నీరు తాగకుండా ఉంటారు. అయితే, అలా ఉండటం ఆరోగ్యానికి ప్రమాదని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. నవరాత్రి ఉపవాసం సమయంలో ఎక్కువసేపు నీరు తాగకపోవడం వల్ల ఎలాంటి సమస్యలు తలెత్తుతాయో, వాటిని ఎలా నివారించాలో ఇప్పుడు తెలుసుకుందాం..

మన శరీరంలో నీరు అత్యంత ముఖ్యమైన భాగం అని వైద్యులు అంటున్నారు. ఇది మనల్ని హైడ్రేటెడ్‌గా ఉంచడమే కాకుండా జీర్ణక్రియ, చర్మం, మెదడు పనితీరును కూడా సహాయపడుతుంది. నవరాత్రి సమయంలో ఎక్కువసేపు నీటిని తాగకుండా ఉండటం వల్ల వివిధ ఆరోగ్య సమస్యలు వస్తాయి.

**డీహైడ్రేషన్:**

దీర్ఘకాలికంగా నీరు లేకపోవడం వల్ల కలిగే అత్యంత సాధారణ సమస్య డీహైడ్రేషన్. చాలా మంది నవరాత్రి సమయంలో నీరు తాగకుండా ఉపవాసం ఉంటారు, ఇది శరీరంలోని నీరు, ఎలక్ట్రోలైట్‌లను తగ్గిస్తుంది. అలసట, తలతిరగడం, బద్ధకం వంటి సమస్యలకు దారితీస్తుంది. తీవ్రమైన సందర్భాల్లో, వాంతులు, విరేచనాలు కూడా సంభవించవచ్చు. 2024 అధ్యయనం ప్రకారం, 2-3% నీటి లోపం కూడా మెదడు పనితీరును తగ్గిస్తుంది, మానసిక స్థితిలో మార్పులు, తలనొప్పికి కూడా దారితీస్తుంది.

**జీర్ణ సమస్యలు:**

ఎక్కువసేపు నీరు తాగకపోవడం వల్ల జీర్ణవ్యవస్థపై ప్రతికూల ప్రభావాన్ని చూపుతుంది. మలబద్ధకం, గ్యాస్, ఆమ్లత్వానికి దారితీస్తుంది. శరీరంలో నీరు లేకపోవడం వల్ల పేగులలో మలం పేరుకుపోతుంది, ఇది మలబద్ధకాన్ని పెంచుతుంది.

**రక్తంలో చక్కెర అసమతుల్యత:**

ఉపవాసం ఉన్న సమయంలో నీరు తాగకపోవడం వల్ల డయాబెటిక్ రోగులకు ప్రమాదకరం. నిజానికి, ఎక్కువసేపు ఆకలితో ఉండటం, ఉపవాసం ఉన్న సమయంలో నీరు తాగకపోవడం వల్ల రక్తంలో చక్కెర స్థాయిలు అకస్మాత్తుగా తగ్గుతాయి. డీహైడ్రేషన్ ఇన్సులిన్ సున్నితత్వాన్ని ప్రభావితం చేస్తుంది, దీనివల్ల డయాబెటిక్ రోగులలో రక్తంలో చక్కెర నియంత్రణ కష్టమవుతుంది. డయాబెటిక్ రోగులు నీరు తాగకుండా ఉపవాసం పాటించడం ఆరోగ్యానికి మంచిది కాదు.

**చర్మంపై చెడు ప్రభావాలు:**

డీహైడ్రేషన్ చర్మాన్ని కూడా ప్రభావితం చేస్తుంది. ఉపవాసం సమయంలో తక్కువ నీరు తీసుకోవడం వల్ల చర్మం పొడిబారడం, పెదవులు పగిలిపోవడం, ముడతలు త్వరగా కనిపించడం జరుగుతుంది. ఒక అధ్యయనం ప్రకారం, రోజూ 8-10 గ్లాసుల నీరు తాగడం వల్ల చర్మ తేమను కాపాడుకోవడానికి, కొల్లాజెన్ ఉత్పత్తిని ప్రోత్సహించడానికి సహాయపడుతుంది.

మూత్రపిండాల ఒత్తిడి: ఎక్కువసేపు నీరు లేకపోవడం మూత్రపిండాలపై కూడా ప్రతికూల ప్రభావాన్ని చూపుతుంది. నీరు లేకపోవడం మూత్ర విసర్జనను తగ్గిస్తుంది, ఇది మూత్రపిండాలలో టాక్సిన్స్ పేరుకుపోయే ప్రమాదాన్ని పెంచుతుంది. ఇది మూత్ర మార్గము అంటువ్యాధులు లేదా మూత్రపిండాల్లో రాళ్లకు దారితీస్తుంది.

# వ్యాయామం నుండి ఆహారం వరకు..

## గుండె ఆరోగ్యంగా ఉండాలంటే ఏం చేయాలి?

సెప్టెంబర్ 29న ప్రపంచ హృదయ దినోత్సవాన్ని జరుపుకుంటారు. ఎందుకంటే ఇది హృదయ సంబంధ వ్యాధుల (గుండె జబ్బులు) గురించి అవగాహన పెంచడానికి, నివారణ చర్యలను ప్రోత్సహించడానికి, గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరిచే జీవనశైలిని ప్రచారం చేయడానికి ఉద్దేశించిన వార్షిక కార్యక్రమం. ప్రపంచవ్యాప్తంగా మరణాలకు ప్రధాన కారణమైన ఈ వ్యాధులపై ప్రజలను చైతన్యపరచడమే దీని ముఖ్య లక్ష్యం. ప్రస్తుత కాలంలో గుండె సంబంధిత వ్యాధులు ఆందోళన కలిగించే విషయంగా మారాయి. యువత కూడా గుండెపోటు వంటి సమస్యలతో బాధపడుతున్నారు. గుండెపోటులు పెరగడానికి ఆధునిక జీవనశైలి (అనారోగ్యకరమైన ఆహారం, నిద్రలేమి, ఒత్తిడి) కారణమని పలు అధ్యయనాలు సూచిస్తున్నాయి. అయితే, గుండె ఆరోగ్యంగా ఉండాలంటే ఏం చేయాలో ఆరోగ్య నిపుణుల నుండి తెలుసుకుందాం..

**ఏం తినాలి?**

ఆరోగ్యకరమైన ఆహారం తీసుకుంటే గుండె సమస్యలను నియంత్రించవచ్చు. గుండెను ఆరోగ్యంగా ఉంచుకోవడానికి, కూరగాయలు, పప్పులు, గింజలు, డ్రై ఫ్రూట్స్, చేపలు, ఓట్స్, గంజి, వివిధ రకాల పండ్లు, తృణధాన్యాలు వంటి పోషకమైన ఆహారాన్ని ఆహారంలో చేర్చుకోవడం మంచిది. ఏదైనా సమస్య కారణంగా హార్ట్ సర్జరీ జరిగితే, ఆహారం గురించి ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలి. ఏం తింటున్నారు? ఎలాంటి ఆహారం తింటున్నారనేది చాలా ముఖ్యం.

**ఏం తినకూడదు?**

మీ ఆహారంలో చక్కెర, ఉప్పు, కొవ్వు కలిగిన ఆహారాలను తగ్గించండి. గుండె ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి, జంక్ ఫుడ్, ప్రాసెస్ చేసిన ఆహారం, వేయించిన ఆహారం మొదలైన వాటికి దూరంగా ఉండాలి, ఎందుకంటే వీటిలో అధిక మొత్తంలో కొవ్వు, ఉప్పు మొదలైనవి ఉంటాయి, ఇవి చెడు కొలెస్ట్రాల్‌కు కారణమవుతాయి. అలాగే, ధూమపానం, మద్యం మొత్తం ఆరోగ్యంపై చెడు ప్రభావాన్ని చూపుతాయి, కాబట్టి వాటికి పూర్తిగా దూరంగా ఉండటం మంచిది.

**క్రమం తప్పకుండా వ్యాయామం**

రోజంతా ఒకే చోట కూర్చుని పనిచేయడం, వ్యాయామం చేయకపోవడం వల్ల బరువు పెరగవచ్చు. ఇది మధుమేహం, రక్తపోటు అసమతుల్యత వంటి సమస్యల ప్రమాదాన్ని పెంచుతుంది, ఇది గుండెపై ప్రభావం చూపుతుంది. అందువల్ల, వ్యాయామం లేదా యోగా వంటివి చేయాలి. గుండె రోగులకు అత్యంత సులభమైన వ్యాయామం ఏమిటంటే, వాకింగ్ చేయడం. ప్రతిరోజూ కనీసం 30 నుండి 45 నిమిషాలు నడవాలి. మీకు మోకాలి సమస్యలు ఉంటే, తక్కువ సేపు నడవచ్చు.

**నిద్ర**

నిద్ర గుండె ఆరోగ్యానికి చాలా మంచిది. ప్రతి రోజు 7-8 గంటలు నిద్రపోవాలి. తగినంత నిద్ర లేకపోవడం వల్ల గుండె జబ్బులు, ఊబకాయం, ఇతర ఆరోగ్య సమస్యల ప్రమాదాన్ని పెంచుతుంది. నిద్ర అనేది శరీరం, మెదడును పునరుద్ధరించడానికి ఒక మార్గం, గాఢ నిద్రలో, శరీరం కణాలను రిపేర్ చేస్తుంది, కండరాలను నిర్మిస్తుంది, హార్మోన్లను సమతుల్యం చేస్తుంది. జ్ఞాపకశక్తిని మెరుగుపరుస్తుంది. తగినంత నిద్ర లేకపోవడం వల్ల దీర్ఘకాలిక ఆరోగ్య సమస్యలు, తక్కువ ఏకాగ్రత, బలహీనమైన రోగనిరోధక శక్తి వంటి అనేక ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయి. కాబట్టి, నిద్ర గుండె ఆరోగ్యానికి చాలా మంచిది.



